క్లుప్తంగా

పరుగు పందెంలో విద్యార్థుల ప్రతిభ



పరుగు పందెంలో విజేతగా నిలిచిన స్వీటీ, చైత్రి

ఐ.పోలవరం: రామచంద్రపురంలో జరిగిన సౌత్ జోన్ అథ్లెటిక్ రాష్ట్రస్థాయి పోటీల్లో ఐ.పోలవరానికి చెందిన విద్యార్థులు ప్రతిభ చాటారు. మండల పరిధిలో మురమళ్ల శాంతి నికేతన్‌కు చెందిన గత్తుల స్వీటీ ప్రథమ స్థానంలో నిలవగా, 100 మీటర్ల పరుగు పందెంలో మందపల్లి చైత్రి ప్రథమ స్థానాలలో నిలిచినట్టు ప్రిన్సిపాల్ గోకవరపు వెంకట రాజు తెలిపారు. వీరిని సౌత్ జోన్ అథ్లెటిక్ అధ్యక్షుడు వై.వెంకన్నాయుడు, కార్యదర్శి రవితేజ, కోచ్ బాబీ, హెచ్ఎం ఆర్.శ్రీనివాస్‌లు అభినందించారు.

యువకుడి కుటుంబానికి ఎమ్మెల్యే ఆర్థిక సాయం



ఆర్థిక సహాయాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే అశోక్

ఎమ్మెల్యే రూ.లక్ష సాయం

యానాం: యానాం–కాకినాడ రహదారిలో పటవల వద్ద గత నెల 26వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కురసాంపేటకు చెందిన యువకుడు కూరాకుల కుమార్ కుటుంబ సభ్యులకు గురువారం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ రూ.లక్ష ఆర్థిక సహాయాన్ని అందజేశారు. మృతిడి గృహానికి వెళ్లి కుటుంబ సభ్యులతో మాట్లాడి ప్రమాదం గురించి తెలుసుకుని ఓదార్చారు. అన్ని విధాలా అండగా ఉంటానని, ధైర్యంగా ఉండాలని భరోసా కల్పించారు.

ఆర్టీసీ ఉద్యోగుల ధర్నా

అమలాపురం రూరల్: ప్రభుత్వం ఆర్టీసీ ఆస్తులను ప్రైవేటు పరం చేసే దిశగా కార్పొరేట్లకు లీజుకు ఇవ్వడానికి నిరసిస్తూ అమలాపురం ఆర్టీసీ డిపో వద్ద యునైటెడ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. గవర్నర్ పేట–2 డిపో స్థలాన్ని లూలూ మాల్‌కు కేటాయిస్తూ విడుదల చేసిన జీవో నంబర్ 137ని వెంటనే రద్దు చేయాలని, ఆర్టీసీ స్థలాలను ప్రైవేటు సంస్థలకు ఇవ్వకూడదని నినాదాలు చేశారు. జిల్లా సెక్రెటరీ వి.గణపతి, డిపో సెక్రటరీ కే రవికుమార్, డిపో అధ్యక్షుడు ఆర్.నారాయణరావు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కోటేశ్వరరావు, కేజీఎస్ మూలయ్య పాల్గొన్నారు.

10న మెగా పాటల పోటీలు

అమలాపురం టౌన్: సినీ హీరో, మెగా స్టార్ చిరంజీవి పుట్టిన రోజు వారోత్సవాల్లో భాగంగా ఈనెల పదో తేదీ ఉదయం 10 గంటల నుంచి అమలాపురం పట్టణంలోని ఏబీసీడీ ఫుడ్ కోర్టులో మెగా పాటల పోటీలు ఏర్పాటు చేసినట్టు జిల్లా చిరంజీవి యువత అధ్యక్షుడు నల్లా చిట్టి తెలిపారు. పోటీల్లో మెగా స్టార్ చిరంజీవి నటించిన చిత్రాల్లోని పాటలు మాత్రమే పాడాలని పేర్కొన్నారు. పోటీల్లోని విజేతలకు బహుమతులు అందజేస్తామని చిట్టి తెలిపారు. ఇతర వివరాలకు 8074141666, 9963317777 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి అభివృద్ధిపై సమీక్ష

అమలాపురం టౌన్: అమలాపురం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు గురువారం సందర్శించారు. ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా ఎమ్మెల్యే ఆస్పత్రి వైద్యులు, కమిటీ ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. త్వరలో ఆస్పత్రికి జరగనున్న అభివృద్ధి ప్రణాళికపై ఎమ్మెల్యే వైద్యులతో చర్చించారు. ఆస్పత్రి వైద్యులు కారెం రవితేజ, అభివృద్ధి కమిటీ ప్రతినిధి వలవల శివరావు, మాజీ కౌన్సిలర్ దున్నాల దుర్గ తదితరులు సమావేశంలో పాల్గొని ఆస్పత్రి అభివృద్ధికి సంబంధించి పలు అంశాలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకుని వచ్చారు.

74 మంది దివ్యాంగులకు వైద్య పరీక్షలు

ముమ్మిడివరం: సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో జిల్లా సహిత విద్యలో భాగంగా గురువారం 74 మంది దివ్యాంగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ముమ్మిడివరం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నియోజకవర్గస్థాయి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 74 మంది ప్రత్యేక అవసరాలుగల పిల్లలకు ఉపకరణాల నిమిత్తం వైద్య పరీక్షలు చేసి వారికి అవసరమైన ఉపకరణాలు కొరకు ధరఖాస్తులు స్వీకరించారు. ముమ్మిడివరం మండలం నుంచి 30, కాట్రేనికోన నుంచి 24, ఐ.పోలవరం నుంచి 20 మంది హాజరయ్యారు. సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు అధికారిని జియమ్మ, జిల్లా సహిత విద్య సమన్వయకర్త సత్యనారాయణ, సీఎంఓ బొరుసు సుబ్రహ్మణ్యం ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తుపాకీతో వ్యక్తి అరెస్టు

అల్లవరం: రెల్లుగడ్డలో నాటు తుపాకీ ఉన్న వ్యక్తిని అల్లవరం పోలీసులు గురువారం అరెస్టు చేశారు. ఉప్పలగుప్తం మండలం ఎస్.యానం గ్రామానికి చెందిన పత్తి హనుమంతు రెల్లుగడ్డ గ్రామంలో తుపాకీతో పక్షులను కాల్చుతుండగా స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ నేపథ్యంలో సీఐ ప్రశాంత్‌కుమార్, ఎస్సై సంపత్‌కుమార్ ఘటన స్థలానికి చేరుకుని తుపాకీ ఉన్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించారు. తుపాకీని సీజ్ చేసి అతనిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై సంపత్‌కుమార్ తెలిపారు.

ప్రకృతి ఒడిలో విడిది

- పర్యాటకులు సేద తీరేందుకు ప్రత్యేక హట్‌లు
- ఆధునిక హంగులు, సౌకర్యాలతో నిర్మాణం
- సర్వాంగ సుందరంగా వసతి గృహాలు

తాళ్లరేవు: తూర్పున ప్రముఖ పర్యాటక కేంద్రంగా రూపుదిద్దుకున్న కోరంగి అభయారణ్యాన్ని సందర్శించే పర్యాటకుల కోసం అటవీ శాఖ ప్రత్యేక హట్‌లు(వసతి గృహాలు)ను అందుబాటులోకి తీసుకువచ్చింది. దేశంలో పశ్చిమ బెంగాల్‌లోని సుందరబన్స్ అడవుల తరువాత రెండో అతిపెద్ద మడ అటవీ ప్రాంతమైన కోరంగి అభయారణ్యాన్ని వేలాది మంది పర్యాటకులు సందర్శిస్తుంటారు. అయితే దూర ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులు విడిది చేసేందుకు అటు కాకినాడ కాని ఇటు యానాం, అమలాపురం కాని వెళ్లాల్సి వచ్చేది. అయితే కోరంగిలోనే పర్యాటకులు సేదతీరడంతో పాటు అక్కడ బస చేసేలా అత్యాధునిక సౌకర్యాలతో అటవీశాఖ వసతి గృహాలను ఏర్పాటు చేసి వాటిని ప్రారంభించింది. కోరంగి పంచాయతీలోని ఫారెస్ట్ కాంప్లెక్స్ ప్రాంగణంలో ఉన్న మూడు హట్‌లతోపాటు మరొక ఫారెస్ట్ భవనాన్ని కూడా అందుబాటులోకి తెచ్చారు. ప్రతి రూములోనూ డబుల్ కాట్ బెడ్, ఏసీ, టీవీ, ఇన్వెర్టర్ సౌకర్యాలను కల్పించారు. పర్యాటకులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేయడంతోపాటు పూర్తిస్థాయిలో రక్షణ ఉండేవిధంగా చర్యలు చేపట్టారు. అంతేకాకుండా ప్రాంగణంలో ఉన్న బయోడైవర్సిటీ భవనాన్ని సందర్శిస్తే కోరంగి మడ అభయారణ్యం విశేషాలను తెలుసుకోవచ్చు. ప్రకృతి ఒడిలో సేదతీరాలనుకునే వారికి ఈ హట్‌లు ఒక వరంగా చెప్పవచ్చు.

అందుబాటు ధరలలోనే అద్దెలు

అటవీశాఖ ఏర్పాటు చేసిన ఈ హట్‌లలో ఒకరోజు బస చేసేందుకు రూ.1500 చెల్లించాల్సి ఉంటుంది. ఫారెస్ట్ కాంప్లెక్స్‌లో ఉన్న అటవీ శాఖ అధికారులను సంప్రదిస్తే ఈ రూములను కేటాయిస్తారు. పిల్లా, పాపలు, కుటుంబ సభ్యులతో వచ్చి సేదతీరవచ్చు. అధిక సంఖ్యలో వచ్చే పర్యాటకుల సౌకర్యార్థం ఒకప్పటి ఫారెస్ట్ బంగ్లాను వీఐపీ రూముగా సాధారణ పర్యాటకులకు సైతం అద్దెకు ఇవ్వనున్నారు. ఈ బంగ్లాకు ఒకరోజుకు రూ.3000 ఛార్జి చేస్తారు. కోరంగి మడ అటవీ ప్రాంతాన్ని సందర్శించి ఒకరోజు ప్రకృతి ఒడిలో సేదతీరడం మరపురాని అనుభూతినిస్తుందని పలువురు చెపుతున్నారు.

ఆన్‌లైన్‌లో బుకింగ్‌లు



కోరంగి ఫారెస్ట్ కాంప్లెక్స్ ప్రాంగణంలో పర్యాటకుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన హట్‌లను ఆన్‌లైన్‌లో కూడా బుకింగ్ చేసుకునే సౌకర్యాన్ని అటవీశాఖ కల్పించింది. నేరుగా వచ్చిన పర్యాటకులకు తమ సిబ్బంది ద్వారా గదులను కేటాయిస్తున్నాం. అలాగే ఏపీ టూరిజం వెబ్‌సైట్ ద్వారా కూడా ఆన్‌లైన్‌లో బుక్ చేసుకునే వీలును కల్పించాం. జిల్లాలోని ప్రముఖ పర్యాటక కేంద్రాలను సందర్శించి అక్కడ బస చేయాలనుకునే వారికి ఇదొక చక్కటి అవకాశం. ఇతర వివరాల కోసం 8985952875 నంబరులో సంప్రదించగలరు.

– ఎస్ఎస్ఆర్ వరప్రసాద్, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్, కోరంగి అభయారణ్యం



కోరంగిలో సర్వాంగ సుందరంగా ఏర్పాటు చేసిన పర్యాటక హట్‌లు



కోరంగి ఫారెస్ట్ కాంప్లెక్స్ హట్‌లలో ఏసీ, టీవీ తదితర సౌకర్యాలు



కోరంగిలోని బయోడైవర్సిటీ భవనం

జగన్ హయాంలో నేతన్నలకు పెద్దపీట

ఉప్పలగుప్తం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మగ్గం ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రతి ఏటా రూ.24000 నేతన్న నేస్తాన్ని అందించి నేతన్నలకు పెద్దపీట వేశారని సర్పంచ్ సలాది ఊర్మిళాదేవి అన్నారు. విలసవిల్లి గ్రామంలో వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సలాది సతీష్ ఆధ్వర్యంలో జాతీయ చేనేత దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఊర్మిళాదేవి కేకును కట్ చేసి చేనేత కార్మికులకు శుభాకాంక్షలు తెలిపారు. ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం నేత కార్మికుల సంక్షేమాన్ని మరుగున పడవేసి వారికి తీరని అన్యాయం చేస్తుందన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ చేనేత పరిశ్రమలను కాపాడాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ చేనేత విభాగం మండల అధ్యక్షుడు బళ్ల నాగసతీష్, చేనేత విభాగం జిల్లా సభ్యులు కారుపర్తి గిరిజాపతి, మాజీ చేనేత సొసైటీ అధ్యక్షులు పుత్స్యల ఏసు, ఉప్పు శంకర్, గంపల బున్ని, కోలాఏసు, గుమ్మడి నీలకంఠం, కొండా భద్రరావు, బేసూ రాజేష్ పాల్గొన్నారు.



విలసవిల్లిలో చేనేత దినోత్సవాన్ని నిర్వహిస్తున్న సర్పంచ్ ఊర్మిళాదేవి తదితరులు

లక్ష్మణస్వామి వర్మకు ఘనంగా నివాళి

తాళ్లరేవు: అగ్నికుల క్షత్రియుల జాతిపిత పొన్నమండ లక్ష్మణస్వామి వర్మ 156వ జయంతిని గురువారం కోరంగి పంచాయతీలో నిర్వహించారు. అగ్నికుల క్షత్రియ ఐక్య మహా సంఘం అధ్యక్షుడు వైదాడి నూకరాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి పుదుచ్చేరి ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తొలుత మల్లాడి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం లక్ష్మణ స్వామివర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఐక్య మహాసంఘం ప్రతినిధి బొడ్డు సత్యనారాయణ, సంఘం కార్యదర్శి దండుప్రోలు నాగబాబు, కోశాధికారి దండుప్రోలు శ్రీను, ప్రతినిధులు పెస్సింగి ఆదినారాయణ, మల్లాడి ఈశ్వరరావు, కొపనాతి నాగరాజు, పాలెపు ధర్మారావు, కొప్పాడి ధర్మారావు, కామాడి మాతరాజు, కామాడి భైరవమూర్తి, రేకాడి నరసింహమూర్తి, ముత్యాలు, లక్ష్మీనరసింహరాజు, శ్రీనివాస్, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



కోరంగిలో లక్ష్మణ స్వామివర్మకు నివాళులు అర్పిస్తున్న మల్లాడి కృష్ణారావు తదితరులు

ఉపాధి పనులపై ప్రజావేదిక

తాళ్లరేవు: మండలంలో రూ.13.16కోట్ల ఉపాధి పనులు చేపట్టినట్టు డ్వామా పీడీ ఏ.వెంకటలక్ష్మి తెలిపారు. గురువారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 18వ విడత ప్రజా వేదిక సమావేశం ఎంపీపీ రాయుడు సునీత అధ్యక్షతన జరిగింది. వెంకటలక్ష్మి మాట్లాడుతూ మండలంలో గత ఆర్థిక సంవత్సరంలో 1516 పనులకు గానూ రూ.6.83కోట్ల మేర వేతనాలు చెల్లించగా, మరో రూ.6.32 కోట్ల సామాగ్రి సమకూర్చినట్లు తెలిపారు. అనంతరం మండలంలోని 17 పంచాయతీల వారీగా జరిగిన పనులపై సమీక్షించారు.

తల్లి పాలే బిడ్డకు రక్షణ కవచం

తల్లి పాల వారోత్సవాల ర్యాలీలో డీఆర్వో మాధవి

అమలాపురం టౌన్: తల్లి పాలే బిడ్డకు ఆరోగ్య రక్షణ కవచంగా ఉంటాయని ఇన్‌చార్జి డీఆర్వో, అమలాపురం ఆర్డీవో కొత్త మాధవి అన్నారు. తల్లే పాలే బిడ్డకు మొదటి టీకాగా, రోగ నిరోధక శక్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు. తల్లి పాల వారోత్సవాల సందర్భంగా స్థానిక ఆర్డీవో కార్యాలయం నుంచి నల్లవంతెన వరకూ గురువారం నిర్వహించిన ర్యాలీని డీఆర్వో మాధవి ప్రారంభించి ప్రసంగించారు. పుట్టిన బిడ్డకు తల్లిపాలు అమృతంతో సమానమని ఆమె అన్నారు. బిడ్డ పుట్టిన గంట లోపే ముర్రుపాలు పట్టించాలని సూచించారు. తల్లిపాల ప్రాముఖ్యతను అందరూ గుర్తించాలని, తల్లిపాల సంస్కృతి కొనసాగించాలని డీఆర్వో మాధవి స్పష్టం చేశారు. ర్యాలీలో డీఆర్వో మాధవితోపాటు డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ సీహెచ్. భరతలక్ష్మి, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి శాంతికుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. ఆర్డీవో కార్యాలయం వద్ద ర్యాలీని డీఆర్వో మాధవి జెండా ఊపి ప్రారంభించగా ఎన్టీఆర్ మార్గ్ మీదుగా నల్ల వంతెన వరకూ సాగింది.



అమలాపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న డీఆర్వో మాధవి, డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ భరతలక్ష్మి

కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులకు సత్కారం

అమలాపురం రూరల్: పోలీస్ కానిస్టేబుల్ ఫలితాలలో అమలాపురం నియోజకవర్గం చెందిన అభ్యర్థులు కానిస్టేబుల్ ఉద్యోగానికి అర్హత సాధించడంపై జిల్లా సెపక్ తక్రా అసోసియేషన్ అధ్యక్షుడు జవ్వాడి తాత బాబు ఎస్కేబీఆర్ కళాశాల వాకర్ సభ్యులు, కాలేజ్ యాజమాన్యం గురువారం సత్కరించారు. ముఖ్య అతిథిగా డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్, ఆర్టీసీ డిపో మేనేజర్ చల్లా సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ కానిస్టేబుల్ ఉద్యోగులు సాధించిన ప్రశాంత్, ఈ సాయి, పీవీ కృష్ణారెడ్డి, ప్రశాంత్‌బాబు, ప్రవీణ్, మధుబాబు, నాగమణి, మౌనికలను అభినందించారు. కోచ్ యాండ్ర గౌతమ్, కేత సతీష్, కూచిమంచి కృష్ణా, తోట రాము, సురేష్, సత్యనారాయణ, రమణ ఉద్యోగులను అభినందిచారు.



అభ్యర్థులను సత్కరిస్తున్న డీఎస్పీ ప్రసాద్, జిల్లా సెపక్ తక్రా అసోసియేషన్ అధ్యక్షుడు తాతబాబు తదితరులు

చెరువులో చేపల మృత్యువాత

అల్లవరం: దేవగుపం బీసీ ఏరియాలోని పంచాయతీకి చెందిన చెరువులో వందలాది చేపలు గత రెండు రోజులుగా ఒక్కొక్కటిగా మృత్యువాత పడ్డాయి. బండారు లంక గ్రామానికి చెందిన ఓ వ్యక్తి పంచాయతీ చెరువుని వేలంపాటలో దక్కించుకుని చేపల పెంపకాన్ని నిర్వహిస్తున్నారు. చెరువులోకి నీరు ఎక్కేందుకు, దిగేందుకు దారులన్నీ ఆక్రమణలకు గురై మూసుకుపోయాయి. చెరువులోని నీరు వెళ్లే మార్గం లేకపోవడంతో చెరువులోని నీరు కలుషితమై చేపలన్నీ చనిపోయాయని కాపాలాదారుడు నాగరాజు తెలిపాడు. చెరువుకి వెళ్లే నీటి మార్గాలు ఆక్రమణకు గురైనా పంచాయతీ కార్యదర్శి, పాలకవర్గం పట్టించుకోకపోవడంపై గ్రామస్తులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మృత్యువాత పడిన చేపల నుంచి దుర్గంధం వెలువడుతుందని కుడుపూడి సూర్యప్రకాశరావు, బొంతు వెంకటేశ్వరరావు, సత్యదుర్గ, భవాని, శేఖర్, జయ శ్రీదేవి, తదితరులు తెలిపారు.



దేవగుప్తం పంచాయతీ చెరువులో చనిపోయిన చేపలు

మాయమాటల బాబుకు బుద్ధి చెబుదాం

బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

అమలాపురం టౌన్: మాయ మాటలతో, సాధ్యం కాని హామీలతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబుకు ఈసారి గట్టిగా బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉండాలని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ పిలుపునిచ్చారు. అమలాపురం పట్టణంలోని 21,22.23.24.25 వార్డుల్లో పట్టణ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో గురువారం జరిగిన «బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ» కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఆయా వార్డుల్లో ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు మోసాలను, మాయ మాటలను ప్రజలకు వివరించారు. 24వ వార్డులో గల ప్రీతి రెసిడెన్సీలో పార్టీ పట్టణ అధ్యక్షుడు సంసాని బులినాని అధ్యక్షతన జరిగిన పట్టణ పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో బాబు మోసాలతో ఉన్న క్యూఆర్ కోడ్ పత్రాలను ప్రదర్శించి నిరసన వ్యక్తం చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు సంసాని బులినాని, పార్టీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు షేక్ అబ్దుల్ ఖాదర్ తదితరులు ఎమ్మెల్సీ ఇజ్రాయిల్‌తో కలసి చంద్రబాబు మోసాలతో ఉన్న క్యూఆర్ కోడ్ పత్రాలను పంపిణీ చేసి ఈసారి బూటకపు హామీలను మరోసారి నమ్మి మోసపోవద్దని ప్రజలకు భవిష్యత్ జాగ్రత్తలను వివరించారు. మున్సిపల్ కౌన్సిలర్లు చిట్టూరి పెదబాబు, దొంగ నాగ సుధారాణి, కొల్లాటి దుర్గాబాయి, బండారు గోవిందు, కట్టోజు సన్యయ్యదాసు, కౌన్సిల్ కో ఆప్షన్ సభ్యుడు జాన్సన్ బెల్లీ తదితరులు బాబు మోసాలను ఇంటింటా ప్రచారం చేశారు. పార్టీ నాయకులు కుడుపూడి భరత్ భూషణ్, వేగిరాజు సాయిరాజు, విత్తనాల మూర్తి, ఖ్వాజాబాబు, పుత్రేవు చందు, యండమూరి శ్రీను, యన్నాబత్తుల సాయి, చిక్కాల రవి శంకర్, పాలమూరు ప్రవీణ్, పిల్లా రజని వాసర్ల సుబ్బారావు, గోపి రమేష్ తదితరులు పాల్గొని ప్రజలకు చంద్రబాబు మాయ మాటలను ప్రజలకు వివరించారు.

అబద్ధపు హామీలతో బాబు మోసం

కాట్రేనికోన: అబద్ధపు హామీలు ఆంధ్ర రాష్ట్ర ప్రజలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మోసం చేశాడని జెడ్పీటీసీ నేల కిషోర్‌కుమార్ అన్నారు. పల్లంలో సర్పంచి మల్లాడి వీరబాబ్జి అధ్యక్షతన గురువారం మండల పార్టీ కన్వీనర్ నల్లా నరసింహమూర్తి ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముమ్మిడివరం నియోజకవర్గం అబ్జర్వర్ మాత మురళీ, పల్లం గ్రామం అబ్జర్వర్ నాతి సత్యనారాయణలు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ నేల కిషోర్ మాట్లాడుతూ సూపర్ సిక్స్ హామీలలో ఒక్క హామీ కూడా పూర్తిగా అమలు చేయలేదని ఎద్దేవా చేశారు. కార్యకర్తలు, నాయకులపై అక్రమ కేసులు బనాయించి, వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. అబ్జర్వర్ మాత మురళీ, మండల పార్టీ అధ్యక్షుడు నల్లా నరసింహమూర్తి మాట్లాడుతూ రాబోయే ప్రభుత్వం మనదేనన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన బాబు ష్యూరిటీ..మోసం గ్యారంటీ కార్యక్రమానికి విశేష స్పందన వచ్చింది. పల్లం, గెద్దనపల్లి గ్రామాలలో ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు చేసిన మోసాలను వివరించారు. క్యూఆర్ కోడ్‌తో ఉన్న బ్రోచర్లను అందచేసి అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో కోలాటి సత్యం, సర్పంచి మల్లాడి వీరబాబ్జి, గంటి వెంకట సుధాకర్, నల్లా రాంబాబు, మోత అంజి తదితరులు ఉన్నారు.



క్యూఆర్ కోడ్ పత్రాలను ప్రదర్శించి నిరసన వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్, శ్రీనివాసరావు తదితరులు



పల్లంలో బ్రోచర్లు ప్రదర్శిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

బోడసకుర్రు టిడ్కో నివాసితులకు వసతులు

అమలాపురం రూరల్: స్థానిక పురపాలక సంఘ పరిధిలో లబ్ధిదారులకు అల్లవరం బోడసకుర్రు గ్రామంలో నిర్మించిన టిడ్కో సముదాయ గృహాల్లో నివాసితులకు కనీస వసతులు కల్పించాలని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో టిడ్కో, మున్సిపల్ అధికారులతో సమావేశం నిర్వహించి తాగునీరు, సీవేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్, డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాట్లు, విద్యుత్ లోవోల్టేజ్ సమస్యలను పరిష్కారం, బరియల్ గ్రౌండ్ ఏర్పాటు, ఎన్టీఆర్ భరోసా పింఛన్లు స్థానికంగా తీసుకునే ఏర్పాట్లు సరిహద్దు గోడ నిర్మాణం తదితర అంశాలపై కలెక్టర్ అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ, మురుగునీరు పైపులైన్ ద్వారా మోటార్ల సహాయంతో బయటకు పంపేందుకు అంచనాలు రూపొందించాలని ఆదేశించారు. తాగునీటి కోసం పక్కనే ఉన్న పంట కాలువ నుంచి పైపులైన్ ద్వారా ఓహెచ్ఎస్ఆర్ వరకు పంపించి స్థానికంగా మైక్రో ఫిల్టర్ ఏర్పాటు చేసి ఆ నీటి సరఫరాకు ప్రతిపాదనలు రూపొందించాలన్నారు. పురపాలక సంఘం పరిధిలోని ఎన్టీఆర్ భరోసా పింఛన్లు బోడసకుర్రు గ్రామానికి మ్యాపింగ్ చేస్తూ స్థానికంగా పింఛన్లు పొందే ఏర్పాటు చేయాలన్నారు. వీధిలైట్లకు మున్సిపల్ కమిషనర్ మరమ్మతులు చేయాలన్నారు. సరిహద్దు గోడ నిర్మించి ఆక్రమణలకు అడ్డుకట్ట వేయాలన్నారు. బరియల్ గ్రౌండ్‌లో ఏర్పాటుకు ఉపాధి అనుసంధానంతో ప్రతిపాదనలు రూపొందించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఓ కే మాధవి, మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్ కుమార్, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ సీహెచ్ ఎన్‌వీ కృష్ణారెడ్డి, టిడ్కో ఎఈ మోహన్ రావు, మున్సిపల్ డీఈ సత్యనారాయణ, టీపీవో రాణి, సంయుక్త ఏఈ భాస్కర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

బంగారు కుటుంబాల అవసరాల గుర్తించాలి

అమలాపురం రూరల్: పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ప్రభుత్వ దాతల ప్రజల భాగస్వామ్యంతో పీ4 కార్యక్రమం లక్ష్యాలను చేరుకునేందుకు గ్రామ సభల ద్వారా సర్వేలు నిర్వహించి బంగారు కుటుంబాల అవసరాల గుర్తించాలని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశించారు. గురువారం సాయంత్రం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.విజయానంద్, అమరావతి నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, స్వర్ణాంధ్ర 2047 లక్ష్యాలు సాధన పీ4 సర్వే, బంగారు కుటుంబాల దత్తత, పాజిటివ్ పబ్లిక్ సంతృప్తి స్థాయిల పురోగతిపై సమీక్షించారు. కలెక్టర్ అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ జిల్లాలో 65 వేల బంగారు కుటుంబాలు ఉండగా ఇప్పటి వరకు 40 వేల బంగారు కుటుంబాలను దత్తత ఇచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ మధుసూదన్, మున్సిపల్ కమిషనర్లు, సీపీవో మురళీకృష్ణ, డీపీవో శాంత లక్ష్మి పాల్గొన్నారు.

చేనేత కార్మికులను సత్కరించిన జేసీ

అమలాపురం రూరల్: బండారులంకలో ప్రపంచ చేనేత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. 27 మంది మహిళా చేనేత కార్మికులులను జేసీ టీ నిశాంతి, ఆర్డీవో కొత్త మాధవి, తహసీల్దార్ ప్రసాద్‌లు గురువారం సత్కరించారు. జేసీ మాట్లాడుతూ చేనేత సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. శ్రీశైలం మాజీ ట్రస్టీ చింతా శంకర మూర్తి, సర్పంచి పెనుమాల సునీత, పిచ్చిక శ్యామ్ బళ్ల వెంకటేశ్వర రావు, మాడా మాధవి, ఆశపు రామలింగేశ్వరరావు, కొండా శ్రీనివాసరావు, యాళ సుబ్బలక్ష్మి, నక్కిన విజయలక్ష్మిలు మహిళ కార్మికులను సత్కరించారు.

కళాశాల విద్యార్థిని ఆత్మహత్య బాధాకరం

అమలాపురం టౌన్: అమలాపురం విద్యానిధి కళాశాలలో విద్యార్థిని ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమని జిల్లా సీపీఎం కన్వీనర్ కారెం వెంకటేశ్వరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఆ విద్యార్థిని ఆత్మహత్య చేసుకునేందుకు కారకులు, బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ మేరకు అమలాపురంలో గురువారం సాయంత్రం ఓ ప్రకటనలో వెంకటేశ్వరరావు తెలిపారు. ఇటీవల కాలంలో కొన్ని కళాశాలల్లో జరుగుతున్న విద్యార్థుల మరణాలు ఆందోళన కలిగిస్తున్నాయన్నారు. ఆయా కళాశాలల యాజమాన్యాలు, అధ్యాపకులు మార్కులు కోసం, ఫీజుల కోసం ఒత్తిడి చేయడం సరి కాదని ఆయన తెలిపారు. విద్యానిధి కళాశాలలో మార్కెల కోసం ఆత్మహత్య చేసుకున్న విద్యార్థినిపై ఒత్తిడి తేవడంపై ఆయన అభ్యంతరం తెలిపారు. ఈ మరణానికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటూనే కళాశాల యాజమాన్యం కూడా ఆ బాధిత కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువుల నిషేధం

- 11 నుంచి విక్రయించినా, వాడినా జరిమానా
- మున్సిపల్ కమిషనర్ నిర్మల్ కుమార్

అమలాపురం టౌన్: పట్టణంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను పూర్తిగా నిషేధించినట్టు మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్‌కుమార్ ప్రకటించారు. ఈనెల 11వ తేదీ నుంచి పట్టణంలో ఈ నిషేధాన్ని అమలు చేస్తున్నామన్నారు. ఆ రోజు నుంచి ప్లాస్టిక్ డిస్పోజబుల్ వస్తువులు, పాలథిన్ కవర్లు విక్రయించినా, వాటిని వాడినా బాధ్యులకు జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. ఇటీవల ప్లాస్టిక్ వస్తువులు అమ్మే హోల్‌సేల్ షాపుల యాజమానులు, వాటిని ఉపయోగించే పలు వ్యాపార సంస్థల ప్రతినిధులతో తాను ప్రత్యేకంగా నిర్వహించిన సమావేశంలో ఈ విషయాన్ని స్పష్టం చేసినట్టు కమిషనర్ పేర్కొన్నారు. పట్టణంలో మొత్తం 16 రకాల సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులు, 120 మైక్రాన్ కన్నా తక్కువ మందం ఉన్న పాలథిన్ కవర్ల వాడకాన్ని ఇక నుంచి పూర్తిగా నిషేధిస్తున్నట్టు ఆయన వెల్లడించారు. ప్లాస్టిక్ కవర్ల స్థానే ప్రత్యామ్నాంగా నార, వస్త్ర, కాగితపు సంచులను వాడాలని సూచించారు. వ్యాపార సంస్థలు, దుకాణ యాజమానులకు బయోడిగ్రేడేబల్ వస్తువులను మాత్రమే వినియోగానికి సిద్ధంగా ఉంచాలని సూచించారు. ప్రస్తుతం పట్టణంలో చాలా వరకూ వ్యాపారస్తులు పర్యావరణ హితమైన వినియోగిస్తున్నారని గుర్తు చేశారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువుల క్రయ విక్రయాలు జరపకుండా చూడాలని కమిషనర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈనెల 11వ తేదీలోపు పట్టణంలోని షాపుల్లో ప్లాస్టిక్ డిస్పోజబుల్ వస్తువులు నిల్వలు ఉంటే వాటిని తయారీ సంస్థలకు తిరిగి పంపించి అప్పగించాలని కమిషనర్ నిర్మల్ కుమార్ సూచించారు. ఈ నిషేధం నూరు శాతం అమలుకు పట్టణంలోని ప్రజలు, షాపుల యాజమానులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

డ్రైవింగ్ లైసెన్స్, హెల్మెట్ తప్పనిసరి

అమలాపురం రూరల్: వాహనచోదకులు డ్రైవింగ్ లైసెన్స్, హెల్మెట్ లేకుండా మోటారుసైకిల్ నడపకూడదని, అలా నడుపుతూ పట్టుబడితే కౌన్సెలింగ్‌కు ఆర్టీవో కార్యాలయానికి హాజరురావాలని జిల్లా రవాణ అధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు సూచించారు. కౌన్సిలింగ్ అనంతరం ఆన్‌లైన్ ద్వారా అపరాధ రుసుం చెల్లించాలని డీటీవో తెలిపారు. మైనర్‌లు అయితే తల్లిదండ్రులు కౌన్సిలింగ్‌కి రావాలన్నారు.

కారు ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

ముమ్మిడివరం: మోటారుసైకిల్‌పై వెళుతున్న గుర్తు తెలియని వ్యక్తిని కారు ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. ముమ్మిడివరం మండలం అనాతవరం పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం మోటారుసైకిల్‌పై వెళుతున్న వ్యక్తిని కాట్రేనికోన తహసీల్దార్ కారు ఢీకొనడంతో తీవ్రగాయాల పాలయ్యాడు. గాయపడిన వ్యక్తి వివరాలు తెలియాల్సి ఉంది.

అనాథ శవానికి అంత్యక్రియలు

కాట్రేనికోన: స్థానిక సుబ్బారాయుడు గుడి వద్ద రోడ్డుపై గురువారం షేక్ బేగం అనే మహిళ మృతి చెందింది. ఆమె బంధువులు ఎవరూ రాకపోవడంతో స్థానికులు సమాచారంతో పంచాయతీ సర్పంచి గంటి వెంకట సుధాకర్ ఆధ్వర్యంలో సిబ్బంది సహాయంతో కాట్రేనికోన ఎస్సై అవినాష్ అంత్యక్రియలు నిర్వహించారు. మృతురాలు గతంలో పోలీసు స్టేషన్‌లో స్వీపర్‌గా విధులు నిర్వహించేది. ఆ మహిళ శవాన్ని ఎవరూ పట్టించుకోకుండా రోడ్డుపై ఎండలో వదిలేశారు. అంత్యక్రియలకు స్థానికులు ముందుకు రాలేదు. పంచాయతీ సిబ్బంది, పోలీసులు సహాయంతో ఎస్సై అంత్యక్రియలు జరిపించారు.